క్లుప్తంగా

వేసవి శిబిరంలో కంప్యూటర్ శిక్షణ



కంప్యూటర్ పనితీరు తెలుసుకుంటున్న విద్యార్థులు

పాయకరావుపేట : విద్యార్థులు కంప్యూటర్ల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సీతారామమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం విద్యార్థులకు కంప్యూటర్ పనితీరుపై, దానిని ఏవిధంగా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు



విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె. జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేసవి శిబిరంలో పుస్తకపఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపించారని జనార్దన్ తెలిపారు. వేసవి సెలవుల్లో ఈ ప్రత్యేక శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



దార్లపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ప్రభుత్వ పాఠశాల ద్వారా నాణ్యమయిన విద్య, వత్తిడి లేని చదువు పిల్లలకు అందించాలని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణశ్రీ సూచించారు. దార్లపూడి గ్రామంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గురువారం ప్రచారం నిర్వహించారు. పలు ఇళ్లకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యా బోధన చేస్తుందన్నారు. ప్రయివేటు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలలో విద్యా బోధన తెలుసుకుని చేర్పించాలన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా ఏ తల్లిదండ్రులు పిల్లలను చదువుకు దూరం చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,స్థానికులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి చందన సమర్పణ



రెండో విడత చందన సమర్పణ తర్వాత లక్ష్మీనృసింహస్వామి

కశింకోట: స్థానికలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని రెండో విడత చందనాన్ని సమర్పించారు. వైశాఖ శుద్ధ తదియ రోజు స్వామి చందనాన్ని తొలగించి, సింహాచలం తరహాలో భక్తులకు నిజరూప దర్శనం కల్పించిన విషయం తెలిసిందే. అదే రోజు శాస్త్రోక్తంగా మళ్లీ చందనాన్ని పూశారు. వైశాఖ పౌర్ణమికి రెండో విడత చందనాన్ని సమర్పించడం సంప్రదాయం. చందన సమర్పణలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

మొక్కజొన్న పంటతో భలే లాభాలు...



మొక్కజొన్న పంట

కోటవురట్ల : మొక్కజొన్న పంటతో మంచి లాభాలు పట్టుబడడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఏడాది పొడవునా సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వాణిజ్యపంటగా మారడంతో మంచి డిమాండ్ ఉంటోంది. మొక్కజొన్న ఎక్కువగా తినుబండారంగా ఉపయోగపడుతుండగా మరో పక్క పశువులకు మేతగా కూడా పనికొస్తోంది. ప్రస్తుతం చాలా పరిశ్రమల్లో ముడి సరుకుగాను, తినుబండారాలు పేలాలు, తీపికండె, కాయగూరల రకంగాను వినియోగిస్తున్నారు. వాడకం బాగా పెరగడంతో సాగు కూడా పెరుగుతోంది. మొక్కజొన్నలో మూడు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలిక(100–120 రోజులు), మధ్య కాలిక(90–100 రోజులు), స్వల్పకాలిక(90 రోజుల లోపు) రకాలు ఉండగా దీర్ఘ కాలిక, మధ్యకాలిక పంటలు అధిక దిగుబడిని ఇస్తాయి.

నేలను ఎలా తయారు చేయాలి..

పంట భూమిని విత్తే ముందు నాగలితో మూడు, నాలుగుసార్లు దుక్కి దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు సుమారు 10 టన్నుల బాగా మాగిన పశువుల గెత్తాన్ని వేయాలి. తరువాత నాగలితో బోదె, కాలువలు చేసుకోవాలి.

విత్తే పద్ధతి...

విత్తే ముందు నాగలితో బోదె తయారు చేసుకోవాలి. బోదెకు పైనుండి మూడో వంతు ఎత్తులో విత్తాలి. దీని వల్ల నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనపుడు నీరు బయటకు పోయేందుకు వీలుకలుగుతుంది. మొలకెత్తిన పది రోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట బలంగా ఉన్న ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలను పీకివేయాలి.

దీర్ఘకాలిక రకాలు..	స్వల్ప కాలిక రకాలు..	మధ్యకాలిక రకాలు..
900 యంగోల్డ్, 30బి07, ఎన్కె 30, బయో 9681, ఎన్కె 6240, ప్రో 311, ఎంసిహెచ్ 36, ఎస్ఎంహెచ్ 3904, జెకెయంహెచ్ 2492 రకాలు లాభసాటిగా ఉంటాయి.	పయనీర్ 3342, కెహెచ్ 5991, డికెసి 7074, జెకె యంహెచ్ 1701, యంయంహెచ్ 133, బయో 605, సన్ వామన్ రకాలు మంచివి.	కోహినూర్, ప్రభల్, బిస్కో 855, జెకెయంహెచ్ 175, బయో 9637, యంసిహెచ్ 2, కెహెచ్ 510, కెహెచ్ 9541, కెయంహెచ్ 25కె60, ఎస్6217 రకాలు మంచి ఫలితాలు ఇస్తాయి.

విత్తనశుద్ధి...

కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం..

వర్షాధారపు పంటకు విత్తే సమయంలో మూడో వంతు నత్రజని, మరోసారి 30–35 రోజుల సమయంలో మూడోవంతు నత్రజని, 50–55 రోజుల మధ్య మరోసారి మూడోవంతు నత్రజనిని వేయాలి. విత్తే సమయంలో మొత్తం భాస్వరం ఎరువును, సగం పొటాష్ ఎరువును వేయాలి. మిగతా సగం పొటాష్‌ను పూత దశలో వేసుకోవాలి. నీటి పారుదల పంటకు విత్తే సమయంలో నాలుగో వంతు నత్రజని, 25–30 రోజుల సమయంలో మరోసారి నాలుగోవంతు నత్రజని, 45–50 రోజుల మధ్య నాలుగో వంతు నత్రజని, చివరగా 60–65 రోజుల మధ్యకాలంలో నాలుగోవంతు వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటల కొకసారి దుక్కిలో వేయాలి. మొక్కలలో జింక్ లోపం ఉన్నట్టయితే లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలి. భూమిలో తగినంత తేమ ఉన్నపుడు మాత్రమే పైపాటు ఎరువులు వేయాలి.

కలుపు యాజమాన్యం..

పంట విత్తిన తరువాత రెండు మూడు రోజులలోపు అట్రజిన్ అనే కలుపు మందును పిచికారీ చేయాలి. దీనిని తేలిక నేలలో ఎకరాకు 800 గ్రాములు, బరువు నేలలో ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి. ఇలా చేయడం వల్ల వెడల్పాటి, గడ్డి జాతి కలుపు మొక్కలను దాదాపు ఒక నెలపాటు అదుపుచేయవచ్చు. మొక్కజొన్నలను పప్పుజాతి పంటల్లో అంతర పంటగా వేసేటపుడు ఎకరా పటంకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్‌ను కలిపి నాటిన రెండు రోజుల్లో పిచికారి చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలను గమనిస్తే ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో 500 గ్రాముల 2, 4డి సోడియం సాల్ట్‌ను కలిపి పిచికారీ చేయాలి.

అంతర కృషి..

విత్తిన 30–35 రోజులకు పశువులతో లేదా, ట్రాక్టరుతో అంతరకృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు. తరువాత నత్రజని ఎరువులను వేసి వెంటనే బోదె నాగలిని నడిపితే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన ఎరువు పంట పెరుగుదలకు దోహదపడుతుంది.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



దిమిలి గ్రంథాలయంలో విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం పలువురు విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. లైబ్రేరియన్ ఎస్.శకుంతల గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. గ్రంథాలయాలను, గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులతో పలు ఆటలు ఆడించారు.

ఆర్బీకేల్లో అందుబాటులో విత్తనాలు

యలమంచిలి రూరల్ : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వరి , పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు తెలిపారు. సుమారు 100 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో రైతులకు అందజేస్తున్నామన్నారు. వ్యవసాయ భూమి పాసు పుస్తకం, ఆధార్ వివరాలతో ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రైతులు సంప్రదించి పచ్చిరొట్ట విత్తనాలు పొందవచ్చన్నారు. అలాగే వరి విత్తనాలు కూడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఆర్‌జీఎల్ 2537, ఎమ్‌టీయూ 1318, 1061, 1064, 1224, 7026 విత్తనాలు రాయితీపై రైతులు కొనుగోలు చేసుకోవచ్చు. కొర్ర,సాము, గంటి విత్తనాలు కేవీకే కొండెంపూడి వద్ద అందుబాటులో ఉంచుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలన్నారు.

దెబ్బతిన్న గ్రోయిన్లు...అందని సాగునీరు



మరమ్మతులు చేపట్టిన మూలపొలం గ్రోయిన్

- ఏటా తాత్కాలిక మరమ్మతులు
- నాలుగేళ్లుగా రూ.35 లక్షలు విడుదల
- పూర్తి స్థాయి మరమ్మతుల కోసం ఎదురుచూపులు

ఎస్.రాయవరం : మండలంలో గ్రోయిన్లు మరమ్మతులు చేపట్టక పంట కాలువలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. వరాహనదిపై ఉన్న గ్రోయిన్లు దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోక ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నదిపై మూలపొలం, పెదఉప్పలం, వమ్మవరం తదితర ప్రాంతాల్లో ఉన్న గ్రోయిన్లు గడిచిన పదేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. గతంలో టీడీపీ హయాంలో మూలపొలం గ్రోయిన్‌కు రూ.సుమారు రెండు కోట్లు కేటాయించి మరమ్మతులు చేపట్టారు. అయితే నాణ్యత లేని కారణంగా మరమ్మతులు చేపట్టిన నెలరోజుల్లోనే గట్టుకోతకు గురై కొట్టుకుపోయింది. అప్పటి నుంచి నది నుంచి సాగునీరు దిగువకు పోతుంది. అదే క్రమంలో పి.ధర్మవరం వద్ద పెదఉప్పలం, ఎస్.రాయవరం చానల్ దగ్గర ఉన్న గ్రోయిన్‌కి గడిచిన నాలుగేళ్లుగా రూ.35 లక్షలు నిధులు విడుదలయినా మరమ్మతులు చేపట్టలేదు. ప్రతి ఏడాది సాగునీరు వృథాగా పోతుంది. సీజన్‌లో రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు ఖర్చు చేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ప్రయోజనం ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వమ్మవరం వద్ద కొరుప్రోలు చెరువుకు వెళ్లే చానల్ కాలువ మరమ్మతులకు గురి కావడం వల్ల సాగునీరు రావడం లేదు. జమ్మి కాలువ వద్ద గ్రోయిన్ మరమ్మతులకు గురి కావడంతో ఏమాత్రం నది ప్రవాహం వచ్చినా పూర్తిగా దిగువకు పోతుంది. దీంతో నదిలో ఏడాది పొడవునా గ్రోయిన్లు మరమ్మతులతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఏడాది ఈ గ్రోయిన్లు 7 వేల ఎకరాలకు పైగా వరి సాగు ఆధారపడి ఉంది. నది ప్రవాహంతో గ్రోయిన్లు సక్రమంగా ఉంటే పంటకాలువల ద్వారా సాగునీరు పొలాల మీదుగా ప్రవహించి ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు నిండుతాయి. తరువాత వర్షాలు ఆలస్యమైనా చెరువు నీటిని పంటలకు అందించడం ఆనవాయితీగా వస్తుంది. ఇకనైనా జిల్లా అధికారులు పరిశీలించి ఈ సీజన్ ప్రారంభం అయ్యేలోపు గ్రోయిన్లు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళాలు



గంగాలమ్మ తల్లిగుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని మూలపేట గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి దాతల సహకారం పెరుగుతూ వస్తుంది. పలువురు దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు అవుతున్నారు. గురువారం మూలపేటకు చెందిన కాండ్రేగుల గంగ వీర నాగేశ్వరరావు–సునీత దంపతులు రూ.30116 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో మరింత మంది దాతలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో భీశెట్టి నాగేశ్వరరావు,కాండ్రేగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: మునగపాకలో ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందిన ఆడారి తాతినాయుడు కుటుంబాన్ని ఆదుకునేందుకు తమవంతు సాయం అందజేస్తున్నారు. మునగపాకలో సంతబయిల ప్రాంతానికి చెందిన పలువురు నగదు పోగు చేసి తాతినాయుడు కుటుంబ సభ్యులకు అందజేశారు. దీనిలో భాగంగా గురువారం తాతినాయుడు కుటుంబానికి కర్రి సాయికృష్ణ, పెంటకోట ఆదిశివ, శివగణేష్‌తో పాటు పలువురు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. రూ.35,700 నగదును బాధిత కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ



వాడనర్సాపురంలో దుర్గాలమ్మ అమ్మవారు



అమ్మవారిని దర్శించేందుకు బారులు తీరిన భక్తులు

రాంబిల్లి : మండలంలో వాడనర్సాపురం గ్రామంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వాడనర్సాపురం సహా పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

అప్పలనరసింహం సేవలు చిరస్మరణీయం



మాజీ ఎంపీ అప్పలనరసింహం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : నాగులాపల్లిలో గురువారం మాజీ ఎంపీ దివంగత పెతకంశెట్టి అప్పలనరసింహం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద అప్పల నరసింహం విగ్రహానికి గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అప్పల నరసింహం నాగులాపల్లి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పెతకంశెట్టి రాజునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, పెద్దలు మళ్ల సురేంద్ర, దాడి ముసిలినాయుడు, పాలమరశెట్టి నాగు, నూకాలయ్య, సాంబశివ, మొల్లేటి సత్యనారాయణ, బొడ్డేడ అచ్చియ్యనాయుడు, గోసాల గోవింద పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

యలమంచిలి రూరల్ : మూడు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ లైన్ల ప్రీ మాన్‌సూన్ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ మీడియాకు తెలిపారు. యలమంచిలి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ రాంబిల్లి రూరల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం గ్రామాలతో పాటు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు యలమంచిలి, ఎర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. పెదపల్లి 11కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలో శేషుకొండ , ఏఎస్సార్ కాలనీలు, మర్రిబంద, పాత ఎర్రవరం, రాంనగర్ ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. నర్సింగబిల్లి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ ఆర్డ బ్ల్యాస్ ఫీడర్, యలమంచిలి రూరల్ పరిధిలో పెదషేకిళ్లపాలెం, చినషేకిళ్లపాలెం, తండాలదిబ్బ, ప్రేమసమాజం ప్రాంతాలకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే...

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు సెక్షన్ పరిధి 11 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కొత్తూరు సెక్షన్ పరిధి కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, వేటజంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం, కశింకోట మండలంలో విసన్నపేట, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

66 బైక్‌లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

పాయకరావుపేట : పట్టణంలో గురువారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి 66 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. నక్కపల్లి, నర్సీపట్నం టౌన్, నర్సీపట్నం రూరల్ సీఐలతో కలిసి 90 మంది పోలీసు సిబ్బంది పట్టణంలో గల అంబేడ్కర్, దుర్గాకాలనీల్లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి 66 బైక్‌లను సంబంధిత రికార్డులు లేనివి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మోటారు బైక్‌ల యజమానులు సంబంధిత రికార్డులను తీసుకొచ్చిన యెడల, వాటిని పరిశీలించి యజమానులకు వాహనాలు అప్పగిస్తామన్నారు.

సీతమ్మకొండపైకి రోడ్డు వేయాలి...



కొండ మీద అల్లూరి విగ్రహం వద్ద బృందం

పాయకరావుపేట : స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నాలుగు సంవత్సరాల పాటు తపస్సు చేసిన పాయకరావుపేట మండల గోపాలపట్నంలో సీతమ్మ కొండ పై ఉన్న శ్రీఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించాలని, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. గురువారం జాతీయ అల్లూరి యువజన సంఘం ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన గోపాలపట్నంలోని సీతమ్మ కొండ పై వున్న శ్రీఉమాధర్మ లింగేశ్వరస్వామి ఆలయ సముదాయాన్ని, చుట్టూ ఉన్న ప్రాంతాలను సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యం కలిగిన దేవాలయానికి రోడ్డు మార్గం లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు వేస్తే జనం తాకిడి పెరిగి దేవాలయానికి ఆదాయ వనరులు పెరిగి స్థానికులే దేవాలయాన్ని అభివద్ధి చేసుకోగలరని అన్నారు. డెక్కన్ కెమికల్ ఇండస్ట్రీ యాజమాన్యం కూడా రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు తెలిసిందని, వారైనా చొరవ చూపి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని వారికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఉపాధ్యక్షుడు వాడపల్లి వెంకటరమణమ్మ, కార్యదర్శి బాబ్జి, ఉత్తమ ఉపాధ్యాయుడు జైబాబు, శివాజీ రాజు పాల్గొన్నారు.

రామచంద్రమ్మ సారె ఊరేగింపు



సారెను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: పట్టణ వాసుల ఇలవేల్పు రామచంద్రమ్మ అమ్మవారి సారె ఊరేగింపు గురువారం జరిగింది. పట్టణానికి చెందిన పలువురు మహిళలు అమ్మవారికి ఇష్టమైన వివిధ రకాల పిండి వంటలను తయారుచేసి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమైన సారె ఊరేగింపు కాకివానివీధి, ధర్మవరం, శతకంపట్టు, తులసీనగర్, పాతవీధుల మీదుగా మహిళలు అమ్మవారి ఆలయానికి చేరుకుని పిండి వంటలను నైవేద్యంగా పెట్టారు. ఈ నెల 30న అమ్మవారి పండగ జరగనుంది. ఇటీవల అమ్మవారి మెరుపుల ఉత్సవం జరిగిన సంగతి తెల్సిందే. ప్రతి ఏటా మెరుపుల ఉత్సవం అనంతరం అమ్మవారికి స్థానిక మహిళలు సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. వచ్చే గురువారం అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ పేర్కొంది.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



శ్రీనివాసుని కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఇంటింట గోవింద కార్యక్రమంలో భాగంగా తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో గురువారం శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. 108 ఉభయదాతలు కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. దంపతుల సమక్షంలో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ ఏటా స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.